ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 22 నవంబరు 2024



## రూపాయికే భోజనం



భోజనం వడ్డిస్తున్న సభ్యులు

బళ్లారిరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో వారం రోజులుగా జైన మందిరం ఎదురుగా జై ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్క రూపాయికే భోజనం వడ్డించి పేదల ఆకలి తీరుస్తున్నారు. ట్రస్ట్ సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. లేనివారి ఆకలి తీర్చడమే ధ్యేయంని జై ట్రస్టు సభ్యులు పేర్కొంటున్నారు.



స్వాధీనం చేసుకున్న నగలు, సామగ్రి

# లోకాయుక్త పంజా

- నలుగురు అధికారుల నివాసాలపై దాడులు

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నలుగురు అధికారులపై లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో లోకాయుక్త మెరుపుదాడులు చేసింది. బెంగళూరు, మంగళూరు, చిక్కబళ్ళాపుర, దావణగెరె, మండ్య తోపాటు వివిధ ప్రాంతాలలో అధికారులు, వారి బంధువులు, కార్యాలయాలపై ఏకకాలంలో గురువారం దాడులు నిర్వహించారు. బెంగళూరు టౌన్‌ప్లానింగ్ విభాగం డైరెక్టర్ తిప్పేస్వామి, కావేరి నీరావరి మండలి ఎండీ మహేశ్, జియాలజిస్ట్ అధికారి కృష్ణవేణి, అబ్కారిశాఖ ఎస్పీ మోహన్‌ల నివాసాలపై దాడులు చేశారు. దావణగెరెలో ఇన్‌స్పెక్టర్ ప్రభు నేతృత్వంలోని బృందం తిప్పేస్వామి భార్య పుట్టినిల్లు దావణగెరె జిల్లా నల్కుదర గ్రామంలో దాడులు చేశారు. ఎస్పీ శ్రీనాథ్ జోషి ఆధ్వర్యంలో బెంగళూరు గిరినగర్‌లోని తిప్పేస్వామి ఇంటిపై దాడి చేశారు. భారీస్థాయిలో బంగారం, వెండి, ఆభరణాలతోపాటు నగదు లభించింది. తిప్పేస్వామి ఇంటికి ఆభరణాలు తయారుచేసేవారిని పిలిపించి పరిశీలించారు. కావేరి బోర్డు ఎండీ మహేశ్‌కు సంబంధించి బెంగళూరు, మైసూరు, మలవళ్ళిలలో దాడులు చేశారు. కేఆర్‌ఎస్‌లో మహేశ్ భార్య పేరిట పెట్రోల్‌బంకులోనూ సోదాలు చేశారు. మంగళూరులోని బెలెస్సీలో నివసిస్తున్న జియాలజిస్ట్ కృష్ణవేణి నివాసం, కార్యాలయంపై దాడి చేశారు. అబ్కారీ ఎస్పీ మోహన్‌కు సంబంధించి వాజరహళ్ళి విల్లాతోపాటు పలు చోట్ల దాడులు చేశారు.

## ఉపపోరులో గెలుపు

# ఎవరిదో..?



- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- రేపటితో వీడనున్న ఉత్కంఠ
- నిఖిల్ గెలిస్తే మంత్రి జమీర్‌కు గుబులే
- బొమ్మై, అన్నపూర్ణ వైపే సర్వేల మొగ్గు

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు నువ్వా..నేనా అన్నట్లుగా ముగిసిన సంగతి తెలిసిందే. జరిగేవి మూడు స్థానాల్లోనైనా కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్‌లు ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. ఇక్కడి ఎన్నికల్లో వారసత్వంతోపాటు సవాళ్లు, ప్రతి సవాళ్ల హోరు సాగింది. ఈనెల 13న పోలింగ్ ముగిసినా మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల పోలింగ్ బుధవారం ఉండడంతో ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించలేదు. ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం 2023 శాసనసభ ఎన్నికల్లో గెలుపొందిన పార్టీలకే అవకాశంగా తేల్చాయి. చన్నపట్టణలో నువ్వా-నేనా అనేలా ఎన్నికలు జరిగాయి. డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామిల మధ్య మాటలయుద్ధంతోనే ఎన్నికల ప్రక్రియ సాగింది. అయితే పోలింగ్‌కు రెండు రోజులముందు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్‌అహ్మద్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఒక వేళ ఇక్కడ జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ గెలుపొందితే మంత్రి జమీర్‌కు గుబులు పట్టుకున్నట్టే అనిపిస్తోంది. కేంద్రమంత్రి కుమారస్వామిని 'కరియ' (నలుపు) అంటూ వ్యాఖ్యానించారు. దేవెగౌడ కుటుంబాన్ని ముస్లింలు చందాలు వేసి కొంటామన్నారు. ఈరెండు వ్యాఖ్యలు పోలింగ్‌పై పెనుప్రభావం చూపినట్లు తెలుస్తోంది. చన్నపట్టణలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సీపీ యోగేశ్వర్ వరుసగా రెండుసార్లు కుమారస్వామిపై ఓటమి చెందినవారే. ఇక నిఖిల్ రాజకీయంగా అరంగేట్రంతోనే కోలుకోలేని దెబ్బలు తిన్నారు. 2019లో మండ్య లోక్‌సభ స్థానం నుంచి, 2023లో రామనగర శాసనసభ నుంచి ఓటమి చెందారు. ఇద్దరూ మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే జేడీఎస్ నిఖిల్‌కు 45శాతం, కాంగ్రెస్ సీపీ యోగేశ్వర్‌కు 41శాతం ఓట్లు పోలైనట్లు సర్వేలు తేల్చాయి. అయితే ఎవరు గెలుపొందినా అరకొర మెజారిటీనే ఉంటుందని, నిఖిల్‌వైపే అవకాశాలు ఉన్నాయని ఎగ్జిట్‌పోల్స్ ద్వారా తెలుస్తోంది. ఇక్కడ గెలుపొందినవారికంటే ఓడినవారే హ్యాట్రిక్ సాధించినట్లు అవుతుంది.

శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్‌బొమ్మైకే అవకాశాలు ఉన్నట్లు సర్వేలు సూచించాయి. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌పఠాన్ బరిలో ఉన్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థికి 47శాతం, కాంగ్రెస్ అభ్యర్థికి 41శాతం ఓట్లు వస్తాయని సర్వేలు సూచిస్తున్నాయి. ఇక బళ్ళారి జిల్లా సండూరు ఎస్టీ రిజర్వేషన్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణకే అవకాశాలు ఉన్నట్లు సర్వేలు పేర్కొంటున్నారు. అన్నపూర్ణ తుకారాంకు 43శాతం ఓట్లు, బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతుకు 40శాతం ఓట్లు దక్కనున్నట్లు ఎగ్జిట్‌పోల్స్ ద్వారా తెలుస్తోంది. దీన్నిబట్టి అధికార కాంగ్రెస్‌కు ఒకటి, ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్‌లకు చెరోస్థానం దక్కే అవకాశాలు ఉన్నాయి. శనివారం ఫలితాల తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి హెచ్‌డీ రాజేష్

బళ్లారిలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను అధికారులు పరిశీలించారు. సండూరు ఓట్ల లెక్కింపు ఇక్కడ చేపట్టనున్నారు.

8



ఢిల్లీలో నందిని పాల ఉత్పత్తులను విడుదల చేస్తున్న సీఎం సిద్దరామయ్య

# దేశంలోనే 2వ స్థానం

- పాల ఉత్పత్తిలో గుజరాత్ తర్వాత రాష్ట్రమే ముందంజ
- రోజుకు 90 లక్షల లీటర్లకు పైగా...
- ప్రోత్సాహకంతోనే ఇది సాధ్యం
- ఢిల్లీలో నందిని బ్రాండ్ల ఉత్పత్తుల విడుదలలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలోనే పాల ఉత్పత్తిలో గుజరాత్ తొలిస్థానంలో ఉండగా కర్ణాటక రెండోస్థానంలో ఉందని సీఎం సిద్దరామయ్య తెలిపారు. గురువారం ఢిల్లీలో కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్), మండ్య జిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్యలు సంయుక్తంగా నందిని బ్రాండ్ ఉత్పత్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గుజరాత్‌లో కురియన్ పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని ప్రారంభించి ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ రాష్ట్రంలో అత్యంత పారదర్శకత, శక్తివంతమైన సంస్థగా రాణిస్తోందన్నారు. రాష్ట్రంలో రోజూ 92-93లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని, రైతులకు లీటరు పాలకు రూ.32 చొప్పున చెల్లిస్తామన్నారు. రూ.5 ప్రోత్సాహం అందిస్తారన్నారు. గతంలో రూ.2 ఉండేదని, తాను సీఎం అయ్యాక రూ.5కు పెంచానన్నారు. రాష్ట్రంలో 16 మిల్క్ యూనియన్‌లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఢిల్లీకి రెండున్నర లక్షల లీటర్లు ఎగుమతి చేయదలిచామని, ఆరు నెలల్లో 5 లక్షలకు విస్తరింపజేస్తామన్నారు. నందిని పాలతోపాటు ఉత్పత్తులకు నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఢిల్లీలో విక్రయం ద్వారా నందిని పాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. మంత్రులు చలువరాయస్వామి, వెంకటేశ్, భైరతి సురేశ్, కేఎంఎఫ్ అధ్యక్షుడు బీమణ్ణ నాయక్, ఎంపీ ఈరణ్ణ కడాడితోపాటు పలువురు పాల్గొన్నారు.

### టెక్ సమ్మిట్‌లో 50 స్టార్టప్ ఉత్పత్తులు



నమూనాను తిలకిస్తున్న బృందం

7



నిరసనలో బీజేపీ నాయకులు

### వక్ఫ్‌బోర్డుకు వ్యతిరేకంగా బీజేపీ నిరసన

7

### ప్రభుత్వాల తీరుతో కార్మికులకు అన్యాయం: సీపీఎం



ర్యాలీలో సీపీఎం నాయకులు

7

# పేదల కడుపు కొట్టడమే..!



మాట్లాడుతున్న విజయేంద్ర

- బీపీఎల్ కార్డుల రద్దుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపాటు
- పునరుద్ధరించకుంటే శాసనసభలో పోరాటమే : ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీపీఎల్ కార్డుల రద్దు ద్వారా సామాన్యులు, పేద వర్గాల కడుపుకొట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కుంటి సాకులు చెబుతూ గ్యారెంటీల్లో ఒక్కొక్క దానికి తొలగించే కుట్ర అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. హుబ్బళ్ళిలో గురువారం విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికే 11.5 లక్షల కార్డులు రద్దు చేశారని, మరో 15 లక్షల బీపీఎల్ కార్డులు రద్దు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. పాన్ కార్డులు వీధి వ్యాపారులు సైతం ఉపయోగిస్తున్నారన్నారు. ఆ సాకుతో కార్డులు రద్దు చేయడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో ఆందోళనలు జరిగాయి. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ పీసీ మోహన్, జయనగర్ ఎమ్మెల్యే కేసీ రామమూర్తి గురువారం అరసు కాలనీలో రేషన్‌కార్డులు రద్దు అయిన పేదల సమస్యలు ఆలకించారు. సీఎం సిద్దరామయ్య అన్నభాగ్య పథకాన్ని కన్నభాగ్యగా మార్చారని అశోక్ మండిపడ్డారు. 45ఏళ్లుగా చిన్నపాటి ఇళ్లల్లో నివసిస్తూ కాలం గడుపుతున్న పేదల రేషన్‌కార్డులను కుంటిసాకులతో రద్దు చేశారన్నారు. అన్నం ఆరోగ్యం పేరిట మోసం చేయడం మంచిదికాదన్నారు. వెంటనే ప్రభుత్వం రేషన్‌కార్డులను పునరుద్ధరించకుంటే శాసనసభలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



బాధితులతో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ బొమ్మై

# కార్డులు యథాతథం..!

- వారంరోజుల్లో అన్ని బీపీఎల్ కార్డుల పునరుద్ధరణ: మంత్రి మునియప్ప



మీడియాతో మంత్రి మునియప్ప

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వారం రోజులుగా సాగుతున్న బీపీఎల్ కార్డుల రద్దు వివాదం తారస్థాయికి చేరిందని, అయితే ఎవరి బీపీఎల్ కార్డులు కూడా మార్పు ఉండదని రాష్ట్ర పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప స్పష్టం చేశారు. విధానసౌధలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్హత కల్గిన ఏ వ్యక్తికి సంబంధించిన బీపీఎల్ కార్డు రద్దు చేయమన్నారు. ఆదాయపు పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బీపీఎల్ కార్డు మాత్రమే ఏపీఎల్‌గా మారుస్తామన్నారు. బీపీఎల్ కార్డుల రద్దు, మార్పు అన్ని అంశాలను తాత్కాలికంగా నిలిపేస్తున్నామన్నారు. వారం రోజుల్లో రద్దు చేసిన అన్ని బీపీఎల్ కార్డులను పునరుద్ధరిస్తామని ఇందులో ఎటువంటి మార్పు ఉండదన్నారు. రాష్ట్రంలో బీపీఎల్ కార్డుల ప్రమాణం 2011 జనాభా ప్రకారం దాదాపు 66శాతం ఉందన్నారు. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రం అర్హతలేని బీపీఎల్ కార్డులను గుర్తించే ప్రక్రియ చేపట్టిందన్నారు. బీపీఎల్ కార్డులు రద్దు చేయలేదని, అనర్హులు ఉంటారనే తాత్కాలికంగా నిలిపేశామన్నారు. ఐటీశాఖ నుంచి పొందిన సమాచారం ప్రకారం పరిశీలన చేపట్టామన్నారు. రాష్ట్రంలో అంత్యోదయ పథకంలో 10,68,028 కార్డుల ద్వారా 43,30,196 మంది సభ్యులు ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిపి ప్రాధాన్యత బీపీఎల్ కార్డులు అంత్యోదయతో కలిపితే 1,24,97,088 కార్డులు ఉండగా 4,34,48,268మంది సభ్యులు ఉన్నారన్నా రు. ఏపీఎల్ కార్డులు 25,62,343 ఉండగా 87,88,188మంది ఉన్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోనే అత్యధిక బీపీఎల్ కార్డులు ఉన్నాయన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని తొలుత తీసుకొచ్చింది కర్ణాటక ప్రభుత్వమేనన్నారు. కేంద్రప్రభుత్వం 5.08 కోట్ల బీపీఎల్ కార్డులు రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలో బీపీఎల్ కార్డుల రద్దు వివాదం తీవ్రమవుతున్న తరుణంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిందన్నారు. సీఎం సిద్దరామయ్య బీపీఎల్ కార్డుల రద్దు ప్రక్రియను వెంటనే నిలిపేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో బీపీఎల్ కార్డుదారులకోసం 20 మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఒప్పందం కుదిరిందని కేంద్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో చర్చలు జరిపామన్నారు. కేజీకి రూ.28 చొప్పున చెల్లించాలని నిర్ణయించామన్నారు. వారం రోజుల్లో బీపీఎల్ కార్డులన్నీ పునరుద్ధరిస్తామన్నారు.

### 24న కెనరాబ్యాంకు మారథాన్

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం, నిత్యం పరుగు, నడక పాటించాలన్న ధ్యేయంతో నగర ప్రజలకోసం కెనరాబ్యాంకు ఈనెల 24న ఆదివారం మారథాన్ నిర్వహిస్తోంది. తెల్లవారుజామున 5 గంటలకు మారథాన్ ప్రారంభం కానుంది. కార్యక్రమంలో 3కే, 5కే, 10కే ఈవెంట్‌లు జరగనున్నాయి. మారథాన్ ద్వారా ఐక్యత, పట్టుదల, మానసిక ధృడత్వం, స్ఫూర్తిని ఇవ్వాలనేదే ఉద్దేశమని బ్యాంకు అధికారులు ప్రకటించారు. మారథాన్ అభిమానులు, యువతీ యువకులను సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. కంఠీరవ స్టేడియం నుంచి మారథాన్ ఆరంభం కానుందని తెలిపారు. 5కే విజేతకు లక్ష రూపాయలు, 10కే విజేతకు రూ. 2లక్షలు సీనియర్ సిటిజన్‌లకు బహుమతులు ఉంటాయన్నారు.




### మాజీ మంత్రి మనోహర తహసీల్దార్ కన్నుమూత

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి మనోహర తహసీల్దార్ (80) కన్నుమూశారు. బెంగళూరు చామరాజపేటలోని శంకర ఆసుపత్రిలో చికిత్స పొందుతుండేవారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక మనోహర తహసీల్దార్ తుదిశ్వాస వీడారు. 2015 కాంగ్రెస్ ప్రభుత్వంలో మనోహర తహసీల్దార్ అబ్కారీ మంత్రిగా పని చేశారు. 2019 శాసనసభ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో జేడీఎస్‌లో చేరారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ జేడీఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయన సొంతూరు అక్కిహొళలో గురువారం అంత్యక్రియలు జరిగాయి. బీఈ మెకానికల్ చదివిన ఆయన నాలుగుసార్లు హావేరి జిల్లా హానగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎస్‌ఎంకృష్ణ సీఎంగా ఉన్నప్పుడు ఉపసభాపతిగా వ్యవహరించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన ఆ తర్వాత 1989, 1999, 2013లలోనూ ఎమ్మెల్యేగా వ్యవహరించారు. మనోహర మృతి పట్ల సీఎం ప్రగాఢసంతాపం వ్యక్తం చేశారు.



మనోహర తహసీల్దార్ (ఫైల్)

### రబీకి నారుమళ్లు సిద్ధం

కంప్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : రబీకి నారుమళ్లు సిద్ధమవుతున్నాయి. కంప్లి తాలుకాలోని పలు గ్రామాల్లో పంపుసెట్ల కింద రైతులు ఇప్పటికే రబీ పంటకు నారుమళ్లు సిద్ధం శారు. కోతలు జోరుగా సాగడంతో ముందు జాగ్రత్తగానే డిసెంబరు నెలలోనే నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నార్లు మొలకలు వచ్చాయి. ఖరీఫ్‌లో నష్టపోయామని, రబీలోనైనా ప్రకృతి సహకరించాలని రైతులు దేవున్ని ప్రార్థిస్తున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని దేవసముద్రం, మెట్రి, నెల్లూడి, రామసాగరం, జవుకు, జానూరు తదితర ప్రాంతాల్లో నారుమళ్ల పెంపకం జోరందుకుంది.



దేవసముద్రం వద్ద నారుమళ్లు

### సుళ్యాడి విషప్రసాదం కేసు

- మహదేవస్వామి బెయిల్ పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా సుళ్యాడిలో విషప్రసాదం పంపిణీ చేసిన కేసులో ప్రధాన నిందితుడు ఇమ్మడి మహదేవస్వామి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. చామరాజనగర జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బీఎస్ భారతి గురువారం బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చారు. ఇప్పటికే మహదేవస్వామి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా అక్కడ తిరస్కరించబడ్డాయి. అయితే అనారోగ్యకారణం చూపి చామరాజనగర సెషన్స్‌కోర్టులో పిటిషన్ వేశారు. 5 సంవత్సరాల 11నెలలుగా మహదేవస్వామి జైలులో ఉన్నాడు. మహదేవస్వామి మహదేశ్వరబెట్ట సాలూరు మఠంలో జూనియర్ స్వామీజీగా కొనసాగుతున్న వేళ సుళ్యాడి కిచ్చిగుత్తి మారమ్మ ఆలయంలో పాలకమండలి ఆధిపత్యం కోసం కుట్ర పన్నారు. ప్రసాదంలో విషం కలిపి పంపిణీ చేశారు. ఈ సంఘటనలో 17మంది భక్తులు మృతి చెందగా 127మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ కేసులో ఏ1 ఇమ్మడి మహదేవస్వామి, రెండో నిందితురాలు అంబికా, మూడో నిందితుడు ఆలయ మేనేజర్ మాదేశ్, నాల్గో నిందితుడు తంబడి దొడ్డయ్యలు మైసూరు జైలులో విచారణ ఖైదీలుగా ఉన్నారు.

## తాగునీటి కోసం రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

విడపనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతానికి గత పది రోజులుగా తాగునీరు రావడం లేదని మండల కేంద్రంలోని సుంకులమ్మ గుడి ప్రాంతవాసులు జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గౌరమ్మ పండుగ ఉన్నా తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. తాగునీరు లేక జీబీసీ వద్దకు వెళ్లి ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లలో తాగు నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. పై నున్న కాలనీలకు రోజు తాగు నీరు వస్తోందని కింద కాలనీలకు తాగు నీరు రావటంలేదని పేర్కొన్నారు. తాగునీరు ఇచ్చేంత వరకూ రాస్తారోకో విరమించేది లేదని రోడ్డుపై భైఠాయించారు. రాస్తా రోకో వద్దకు సీఐ చిన్నగౌస్ చేరుకుని మహిళలతో చర్చించారు. సాయంత్రంలోగా తాగు నీరు అందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు. టీడీపీ నాయకులు ఈ విషయాన్ని వెంటనే మంత్రి పయ్యావుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలో తాగునీటి సమస్య ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ అధ్వర్యంలో సాయంత్రానికి తాగునీరు అందించి సుంకులమ్మ ఏరియాలో తాగు నీటి సమస్యను పరిష్కరించారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న సీఐ చిన్నగౌస్



# మోడ్రన్ సాగు..!

### ఇంటర్నెట్‌లో అన్వేషణ.. డ్రాగన్ ఫ్రూట్‌తో లాభార్జన..!

తండ్రి మెడికల్ షాపు నిర్వాహకుడు..
కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..
వ్యవసాయం చేయాలనుకున్నారు..
చేనులో బోరు వేశారు..
ఆధునిక పంటలపై దృష్టి పెట్టారు..
కుమారుడు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి..
ఈ ప్రాంతం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు
అనుకూలమని గుర్తించాడు..
పంట సాగుకు ఉపక్రమించారు..
ఆధునిక పద్ధతులు అవలంబించారు..
మొదటి కోతలోనే లక్షల లాభాలు పండించారు..
ఇక రానున్నవన్నీ.. లాభాలే..





మల్లాపల్లి వద్ద సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట

**గోరంట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మల్లాపల్లికి చెందిన రైతు బాలకృష్ణ డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేసిన ఏకైక రైతుగా, లాభాలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆధునిక పద్ధతులతో పంట సాగు చేశారు. తొలి కోతలోనే పెట్టుబడిలో 90 శాతం రాబట్టారు.

వ్యాపారం నుంచి.. వ్యవసాయంలోకి..

మల్లాపల్లికి చెందిన బాబయ్యగారి బాలక్రిష్ణ డీ పార్మసీ చేశాడు. 1982లో గోరంట్లలో మెడికల్ దుకాణం ఏర్పాటు చేశాడు. 2018 వరకు కొనసాగించాడు. స్వగ్రామంలో సొంత పొలం ఉండడంతో అందులో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడడంతో మెడికల్ షాపును మూసేసి, వ్యవసాయం వైపు మళ్లాడు. వర్షపాతం తక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనువైన పంట సాగుచేయాలని దృష్టి సారించారు. కుమారుడు రవిశంకర్ ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, గోరంట్ల వాతావరణానికి డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంటగా గుర్తించాడు. దీంతో 1.82 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ పంటను రెండేళ్ల క్రితం సాగుచేశారు.



పంట దిగుబడిని చూపుతున్న రైతు బాలకృష్ణ

### మొదటి కోతలోనే 90శాతం రాబడి

కర్ణాటకలోని పెసరగట్టలో ఒక్కో డ్రాగన్ మొక్క రూ.65 చొప్పున 3,200 కొనుగోలు చేశారు. 800 సిమెంటు స్తంభాలు నాటారు. వాటిపై ప్లేట్లు ఏర్పాటు చేశారు. స్తంభం చుట్టూ నాలుగు మొక్కల వంతున నాటారు. డ్రిప్ ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. ఎకరాకు రూ.4.50 లక్షల వంతున మొత్తం పంట సాగుకు రూ.9లక్షలు ఖర్చయింది. పశువుల ఎరువు, సూక్ష్మధాతువులను డ్రిప్ విధానంలో అందించారు. ఎప్పటికప్పుడు కలుపు తొలగిస్తూ వచ్చారు. 16 నెలలకు మొదటి పంట కోతకొచ్చింది. ఏడు టన్నుల దిగుబడి దక్కింది. దీంతో రూ.7.70 లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపాడు. పెట్టుబడిలో 90శాతం తొలికోతకే వచ్చిందని రైతు ఆనందం వ్యక్తం చేశాడు.

### ఏటా దిగుబడి..

పది నెలల వ్యవధిలో ఏటా ఒకసారి దిగుబడి వస్తుంది. రెండో పంటలో ప్రస్తుతం 12 టన్నుల దిగుబడి వచ్చిందని రైతు తెలిపాడు. రూ.12లక్షల ఆదాయం సమకూరింది. ఖర్చులుపోను రూ.10లక్షలు మిగిలింది. తోట వద్దే వ్యాపారులకు కిలో రూ.వందతో విక్రయిస్తున్నారు. ఏటా ఎరువులు, కలుపుతీత, కూలీల కోసం రూ.50వేలు ఖర్చు చేస్తున్నట్లు రైతు తెలిపాడు.



డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడి

### ఈ ప్రాంతానికి అనువైన పంట

జిల్లాకు డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంట. ఇక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి 10 నుంచి 15 రోజులకోసారి నీటి తడులు ఇవ్వాలి. చలికాలం చివరలో ఫంగస్ వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో ఫంగస్‌ను గుర్తించి, కొమ్మలను కత్తిరించి, పడేయాలి. ఒకసారి పెట్టుబడి పెడితే 20నుంచి 25 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. కాయలు పక్వానికి వచ్చిన వెంటనే సకాలంలో కోయకపోతే పగిలి పాడైపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభదాయకంగా ఉంటుంది.

\- బాలకృష్ణ, రైతు, మల్లాపల్లి

## ఏప్రిల్‌లో వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ

### ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు



సిల్వర్ జూబ్లీ నిర్వాహక కమిటీతో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 ఏప్రిల్ నెలలో రజతోత్సవాలు (సిల్వర్ జూబ్లీ) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వాహక కమిటీతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2000 సంవత్సరం నుంచి 2019 వరకు ఇక్కడి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా పూర్వవిద్యార్థుల సంఘంలో సభ్యత్వం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యుల ఆమోదం మేరకు సభ్యత్వ రుసుమును రూ.ఐదువేలు నిర్ధయించినట్లు వెల్లడించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ సంబరాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్పోర్ట్స్‌డేకు స్టార్ షట్లర్ పీవీ సింధు, మాజీ క్రికెట్ టీం కెప్టెన్ రాహుల్ ద్రావిడ్, టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నడాల్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తామన్నారు. అనంతపురంలో విశేష సేవలందించిన సీనియర్ వైద్యులందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఈ సంబరాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంబరాలను పురస్కరించుకుని ఫిబ్రవరి, మార్చి నెలల్లో మెడికల్ ఎగ్జిబిషన్స్ నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారామ్, డాక్టర్ మధుసూదన్, చైతన్య, నీలిమ చౌదరి, రమణనాయక్, శ్రీహర్ష, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, భీమసేనాచారి, శ్రీనివాసులు, శైలజ, స్వాతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సెక్టోరియల్ జాబితాలో అక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఎల్లన్న, నాగభూషణం తదితరులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల ఎంపిక జాబితాను అక్రమంగా రూపొందించారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ మెంబర్ ఎల్లన్న, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం మండిపడ్డారు. ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన వరలక్ష్మి సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకంలో వసూళ్లకు పాల్పడి అనర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు దక్కాల్సిన పోస్టులను అమ్ముకుని జాబితాను తయారుచేశారన్నారు. గత డీఈఓ వరలక్ష్మి ఎంపిక చేసిన జాబితాను రద్దుచేసి అర్హులైన రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ వెంకటేశులు, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, స్థానిక పెద్దలు రామ్మూర్తినాయుడు సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నాలుగు నెలల 17 రోజులకుగాను రూ.13,15,634 ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు.

## నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించండి

### సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్యమంత్రి, పలువురు మంత్రులను కోరారు. అసెంబ్లీ ఆవరణంలో గురువారం వారు సీఎం చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను కలిసి వినతి పత్రం అందజేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని నడిమివంక రక్షణ గోడ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో ప్రాజెక్టుల పనులను చేపట్టాలని కోరారు. పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు, గేట్ల మరమ్మతులు చేయించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 53 చెరువులకు నీరందించాలన్నారు. హెచ్చెల్సీ ద్వారా పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కాలవ నుంచి తాడిమర్రి మండలంలోని చివరి చెరువు వరకూ నీరు అందేలా చూడాలన్నారు. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు నిలిపివేశారని, ఈ ప్రాజెక్టు పరిధిలో రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి ప్రాజెక్టును నిర్మించాలని ఇరిగేషన్ మంత్రిని కోరారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు మంజూరు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరగా.. ఆయన వెంటనే సీఎండీకి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పలు గ్రామాలు, ఎస్సీఎస్టీ కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని తిరుమల దేవరస్వామి ఆలయం సముదాయంలోని దుర్గాదేవి ఆలయానికి మెట్ల ఏర్పాటు, రూ.50లక్షలతో స్నాక్‌బార్ మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమల దేవర వెంకటేశ్వరస్వామి ఆలయంలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధి, ఎన్‌హెచ్ 44 అనంతపురం సమీపంలోని మరూరు టోల్‌గేట్ వద్ద రూ. 25 లక్షలతో స్నాక్ బార్ నిర్మాణం, ఆత్మకూరు జాతీయ రహదారి సమీపంలో టూరిజం వేసైడ్ సౌకర్యాలు, ననకోట ముత్యాలమ్మ గుడి దగ్గర, చెన్నేకొత్తపల్లి మండలం సమీపంలోని కోన శివాలయం వద్ద పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, టూరిజం రెస్టారెంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పేరూరు డ్యాం వద్ద బోటింగ్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేయగా... ఆయన సానుకూలంగా స్పందించారు. మరోవైపు భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కలిసి రామగిరి బంగారు గనులను మళ్లీ తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందిస్తూ... సంబంధిత శాఖల అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు తెలిపారు.

## లస్సీ షాపులో రూ.లక్ష చోరీ

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లస్సీ షాపులో రూ.లక్ష చోరీ అయ్యింది. నగరంలోని లాల్‌బాగ్ స్ట్రీట్‌లో చిన్న కుళ్లాయిస్వామి కుటుంబంతో నివాసముంటున్నాడు. కమలానగర్‌లో వినాయ క లస్సీ పాయింట్ పేరుతో ఓ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈనెల 19న రాత్రి 10గంటలకు షాపు మూసి వెళ్లారు. 20 ఉదయం దుకాణం తెరిచే ప్రయత్నంలోనే తాళాలు బద్దలు కొట్టినట్లు గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో ఉండాల్సిన రూ.లక్ష, ఒక మొబైల్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని నేతాజీనగర్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని సుగుణ ఇంటి నుంచి అదృశ్యమైంది. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో ఆరా తీశారు. స్కూల్‌కు రాలేదని చెప్పడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వుల కొట్టివేత

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దీంతో తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ గురువారం జడ్పీలోని అధికారులకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. గతంలో నిధుల దుర్వినియోగం, ఇతర ఆరోపణలపై గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కొందరు ఉన్నతాధికారుల ఒత్తిళ్లవల్ల ఆయనను పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పురావడంతో పోస్టింగ్ కోసం జడ్పీలో అధికారులను కలిశారు.

## గ్రామీణ బాలికల క్రికెట్‌లో సెంచరీల మోత



తేజశ్రీ శర్మ, నందేశ్వరి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా బ్యాటర్లు సెంచరీల మోత మోగించారు. గురువారం జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తాధ్వర్యంలో రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. నార్పల అండర్-16, పెనుకొండ అండర్-16 బాలికల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 379 పరుగులు చేసింది. బ్యాటర్ తేశ్రీ వర్మ 102 బంతుల్లో 35బౌండరీల సాయంతో 173 పరుగులు, నందేశ్వరి 111 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన పెనుకొండ 30ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 126పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. సెంచరీలు సాధించిన బ్యాటర్లకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

## లక్ష్యాలను వందశాతం సాధించాలి: కలెక్టరు

అనంతపురంటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆయాశాఖలకు కేటాయించిన ప్రభుత్వ పథకాల లక్ష్యాలను వందశాతం సాధించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన గురువారం అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హౌస్‌టుహౌస్ జియోకోఆర్డినేట్స్ అప్డేట్ పెండింగ్ అనంతనగరంలో అధికంగా ఉందని దీనిని వేగవంతం చేయాలని నతరపాలక అధికారులను ఆదేశించారు. నగరపాలక పరిధిలో సచివాలయ సిబ్బంది కొరతతో పాటు మూడేళ్ల కిందట మ్యాపింగ్ జరిగిందని, ఎక్కువ వయసు ఉన్న వయోవృద్ధులు ఎక్కువ మందికి ఐరిష్, బయోమెట్రిక్ పనిచేయడంలేదని కమిషనర్ వివరించారు. ఇంకొందరు నెలమొదటిలో వచ్చి పింఛన్ తీసుకొని, ఆతర్వాత కనిపించకుండా పోతున్నారని, అందుకే ఎక్కువ మ్యాపింగ్ చేయలేకపోతున్నామని తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పింఛన్లు ఇచ్చేరోజే డోర్‌టు డోర్ ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. మరణించిన వారిపేర్లు జాబితాలో ఉన్నాయని దీనిపై స్పష్టత తీసుకుందామని తెలిపారు. బ్రహ్మసముద్రం, కుందిర్పి, శెట్టూరు, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్‌లలో ప్రణాళిక వేసుకొని ప్రగతి సాధించాలని ఆదేశించారు.

**• షోకాజ్ నోటీసు ఇవ్వండి**

కలెక్టరు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు బెళుగుప్ప ఎంపీడీఓ గైర్హాజయ్యారు. దీనిపై జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. అధికారులు క్రమశిక్షణతో మెలగాలని ఈసందర్భంగా కలెక్టరు సూచించారు.

## ఆర్ఆర్‌బీ పరీక్షకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ నియామకం కోసం నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు (నం. 07105) ఈనెల 23న నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6-25 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07106) తిరుపతిలో ఈనెల 24మధ్యాహ్నం 3-35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8-25 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ముడ్‌ఖేడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే హుబ్లీ-కర్నూలు ప్రత్యేక రైలు (నం. 07315) ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో హుబ్లీలో రాత్రి 8-15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు కర్నూలుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07316) కర్నూలులో ఈనెల 25, 26, 27, 28 తేదీల్లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4-15 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట, తోరణగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

## వ్యవసాయ తోటల్లో కేబుల్‌వైరు చోరీ



ఆదినారాయణరెడ్డి తోటలో కేబుల్ వైరు ఎత్తుకెళ్లిన దుండగులు

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామంలో బుధవారం రాత్రి కేబుల్ వైరు దొంగలు పేట్రేగిపోయారు. 8మంది రైతుల వ్యవసాయ బోరుబావుల కేబుల్‌వైరు చోరీ చేశారు. గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు, జయనాయుడు, రాజామనోహర్‌నాయుడు, చంద్రశేఖర్, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి, గోపాల్‌రెడ్డి అనే రైతుల తోటల్లో సుమారు 200మీటర్ల కేబుల్‌వైరును దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. దుండగుల ఆగడాలతో పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన కొందరు దుండగులు కేబుల్‌వైర్ల చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు తెలిపారు. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సుధాకర్‌నాయుడు తోటలో...



రాజా మనోహర్ నాయుడు తోటలో, నరసింహా రెడ్డి తోటలో..

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### ములాయంసింగ్ యాదవ్ (జయంతి)



సమాజ్‌వాదీ పార్టీ సంస్థాపకులలో ఒకరైన ములాయంసింగ్ యాదవ్ 1939 నవంబరు 22న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఎటావా జిల్లాలోని సైఫాయ్ గ్రామంలో జన్మించారు. 1992 నుంచి 2017 వరకు సమాజ్‌వాదీ అధ్యక్షుడిగా కొనసాగారు. వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1996-98 మధ్యన యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కేంద్రంలో డిఫెన్స్ మంత్రిగాను కొనసాగారు. ఏడుసార్లు ఎంపీగా, 10సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఘనత ఆయనది. 2022 అక్టోబరు 10న కన్నుమూశారు.

### మంగళంపల్లి బాలమురళీకృష్ణ (వర్ధంతి)



పద్మ విభూషణ్ గ్రహీత ప్రముఖ కర్ణాటక సంగీత గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకా శంకరగుప్తం గ్రామంలో జన్మించారు. గాయకుడిగానే కాకుండా వయోలిన్ విద్వాంసుడు, వాగ్గేయకారుడు, సినీ సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. మృదంగం, కంజీర (డిక్కీ)లోనూ నిష్ణాతులు. 8వ యేటనే కచేరీతో బాలమేధావి అనిపించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 25వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. టీటీడీ, శృంగేరీ పీఠాలకు ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. ప్రపంచ స్థాయిలో 'చేవెలియర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి అందుకున్నారు. అత్యున్నత పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతోపాటు గాన కౌస్తుభ గాన, గానగంధర్వ, గానశిఖామణి, జ్ఞానశిఖామణి, గంధర్వ గాన సామ్రాట్ వంటి బిరుదులు, ఇంకా గౌరవ డాక్టరేట్‌లు, ఇతర సత్కారాలు పొందారు. 2016 నవంబరు 22న చెన్నైలో కన్నుమూశారు.

### జాక్ లండన్ (వర్ధంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ నవలా రచయిత జాన్ గ్రిఫిత్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. పాత్రికేయుడు, సమాజ సేవకుడిగా పేరొందారు. రచనల ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్ అండ్ వైట్ ఫ్యాంగ్' రచన, చిన్నకథలు 'టు బిల్డ్ ఎ ఫైర్', 'యాన్ ఒడిస్సీ ఆఫ్ నార్త్' వంటివి పేరొందాయి. ఆయన సాధనలకు గ్రేట్ అమెరికన్ సిరీస్ పోస్టల్‌స్టాంప్ విడుదలైంది. ఆయన పేరిట కాలిఫోర్నియాలోని ఓక్‌ల్యాండ్ సమీపంలో ఓ ప్రాంతానికి 'జాక్ లండన్ స్క్వేర్'గా నామకరణం చేశారు. 1916 నవంబరు 22న కన్నుమూశారు.

## ప్రైవేట్ బస్సు, కారు ఢీ

శిడ్లఘట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆగియున్న ప్రైవేట్ బస్సును వెనుకనుంచి కారు ఢీ కొన్న ఘటన శిడ్లఘట్ట - బెంగళూరు మార్గంలోని చౌడసంద్ర గేట్ వద్ద చోటు చేసుకుంది. బుధవారం ఉదయం మంచు వాతావరణం నెలకొనడంతో ఎదురుగా ఉన్న వాహనాలను గుర్తించలేని వేళ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కారులో ఎయిర్‌బ్యాగ్ ఓపెన్ కావడంతో అందులోనివారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అయితే వాహనం పూర్తిగా దెబ్బతింది. శిడ్లఘట్ట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## మహిళకు పాము కాటు

ధర్మవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీ చెన్నకేశవపు రానికి చెందిన లక్ష్మమ్మ గురువారం పాముకాటుకు గురైంది. ఆమె ప్రియాంకనగర్ సమీపంలోని చెరువులోని బట్టలు ఉతుకుతుండగా.. పాముకాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

## డ్రిప్ పరికరాల చోరీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు గ్రామంలో రైతులు శ్రీనివాసులు, వెంకటనర్సు పొలా ల్లోని బోరు వద్ద డ్రిప్ పరికరాలు బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. ఒక్కొక్కరు రెండు ఎకరాల చొప్పున బోరు బావికింద వేరుశనగ సాగుచేశారు. బుధవారం సాయంత్రం పంటలకు డ్రిప్ ద్వారా నీరు అందించి ఇంటికొచ్చారు. గురువారం ఉదయం పొలం వద్దకువెళ్లి చూడగా ఇరువురి డ్రిప్‌ల పరికరాలూ చోరీకి గురైనట్లు చెప్పారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగు గుండు తండాల్లో ఓ మహిళ వద్ద ఉన్న 40 కర్ణాటక మద్యం బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ మారుతిరావు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేశామన్నారు.

# టెక్ సమ్మిట్‌లో 50 స్టార్టప్ ఉత్పత్తులు

బెంగళూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్ సమ్మిట్‌లో వివిధ రంగాలకు చెందిన 50 స్టార్టప్ ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), హెల్త్‌కేర్, డీప్‌టెక్, సైబర్‌భద్రత, డిఫెన్స్, అగ్రి తదితర రంగాలకు చెందిన ఉత్పత్తులు విడుదల చేశారు. వివిధ రాష్ట్రాల సహకారంతో ఇవి ఏర్పాటు 50కుగాను 23 వాటికి మహిళా పారిశ్రామికవేత్తలే నాయకత్వం వహిస్తుండడం విశేషం. బెంగళూరు టెక్ సమ్మిట్ చివరిరోజు ప్యాలెస్ మైదానానికి సందర్శకులు, విద్యార్థులు తరలివచ్చారు. రోబోట్‌లు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలతో రూపొందించిన నమూనాలు, గండభేరుండ, థింకర్‌మ్యాన్ వంటి వాటితో సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. సదస్సులో చివరి రోజు గురువారం రెవెన్యూ మంత్రి కృష్ణ బైరేగౌడ పాల్గొన్నారు. రెవెన్యూ విభాగంలో సాంకేతికతను ఎలా అభివృద్ధి చేయాలి, ఏఐ టెక్నాలజీ ప్రయోజనాల అంశాలపై నిపుణులతో సమీక్షించారు. అంతకుముందు ఐటీబీటీ మంత్రి ప్రియాంక ఖర్గే పలు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు.




టెక్ సమ్మిట్‌లో రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ



సదస్సులో సందర్శకుల సందడి ఇలా..

### 300 కోట్ల డాలర్ల పెట్టుబడులు లక్ష్యం

అంతరిక్షరంగంలో వచ్చే ఐదేళ్లలో 300 కోట్ల డాలర్ల పెట్టుబడులను రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా కలిగింది. రాష్ట్ర అంతరిక్షరంగ సాంకేతిక విభాగంలో 2024-29 సంవత్సరాలకు సంబంధించిన పాలసీలలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. రాష్ట్ర ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, ఇస్రో అధ్యక్షుడు సోమనాథ్, డీఆర్‌డీఓ అధ్యక్షుడు మంజునాథ్‌లు ఈ పాలసీలను విడుదల చేశారు. మూడు రోజుల సదస్సు ఉత్సాహంగా ముగిసింది.

# బాలగంగాధరస్వామీజీ దూరదృష్టి అపారం

» బీజీఎస్ ఉత్సవ్ ఆరంభంలో నిర్మలానందనాథ స్వామీజీ

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నిపుణులు ఆలోచించని రీతిలో భవిష్యత్తు గురించి సన్యాసిగా కొనసాగుతున్న బాలగంగాధరనాథ స్వామీజీ వ్యవహరించారని ఆయన సమాజానికి సేవలు అపారమని ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ అభిప్రాయపడ్డారు. రెండు రోజుల బీజీఎస్ ఉత్సవ్ గురువారం ప్రారంభించారు. సమాజంలో అత్యాశ కల్గినవారిని సైతం సమానంగా చూసేశక్తి గురుసేవ, సమాజసేవ ద్వారా నిరూపించారన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో పేదలకు బీజీఎస్ ఆసుపత్రుల సేవలు ఆశాజనకమన్నారు. ఆదిచుంచనగిరి మఠం కులమతాలతో సంబంధం లేకుండా అన్నం, అక్షరం, ఆశ్రయం ద్వారా లక్షలాదిమంది పిల్లలను ఉత్తమ పౌరులుగా తీరుస్తోందన్నారు. దేశ విదేశాల విద్యార్థులు ఇక్కడికి రావడం సంతోషకరమన్నారు. బీజీఎస్ ఎస్‌జీబీ గ్రూపుల సంస్థల ఎండీ ప్రకాశనాథస్వామీజీ ముఖ్యులుగా పాల్గొన్నారు. మధుబాల, పుట్టరాజు, ధనలక్ష్మి, ఎన్‌వీ బాబులకు సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు. ఇదే సందర్భంగా నూతన ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అశ్విని పునీత్‌రాజ్‌కుమార్, అరుణ్ యోగిరాజ్, నటి ప్రియాంక ఉపేంద్రలు పాల్గొన్నారు.



బీజీఎస్ ఉత్సవ్‌లో నిర్మలానందనాథస్వామీజీ తదితరులు

## మేలూరులో టైలరింగ్ తరగతులు

శిడ్లఘట్ట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ శిడ్లఘట్ట ఆధ్వర్యంలో మళ్నూరు పరిధిలోని మేలూరు గ్రామంలో జ్ఞానవికాస కార్యక్రమంలో భాగంగా టైలరింగ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు స్వావలంబనకు టైలరింగ్ ఎంతో సహకరిస్తుందన్నారు. సంస్థ యోజనాధికారి సురేశ్‌గౌడ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ఇతరత్రావారు నైపుణ్య తరగతులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. జనజాగృతి వేదిక సభ్యుడు త్యాగరాజ్ మాట్లాడుతూ ఇలాంటి తరగతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అరుణ, ధనంజయ, కవిత, ఉమా, ట్రైనర్ మంజుళా, జ్ఞానవికాస సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్ తరగతుల ప్రారంభంలో పంచాయతీ అధ్యక్షురాలు శశికళ తదితరులు

## భక్తుల మనోభావాలకు ప్రాధాన్యం

» టీటీడీ బోర్డు సభ్యుడు మునికోటేశ్వరరావు



టీటీడీ బోర్డు సభ్యుడు ముని కోటేశ్వరరావుకు సన్మానం

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలకు ప్రాధాన్యతనిస్తామని టీటీడీబోర్డు సభ్యుడు అక్కిన ముని కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. బెంగళూరులో ముని కోటేశ్వరరావును మిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సౌలభ్యాలతోపాటు ఇతరత్రా మెరుగైన సేవలు మా ఆశయమన్నారు. గతంలో జరిగిన తప్పిదాలతో భక్తులు ఇబ్బంది పడ్డారన్నారు. బెంగళూరుతో నాకు దశాబ్దాలకాలంగా సంబంధం ఉందని ఇక్కడి మిత్రులు సత్కారం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రామ జోగేశ్వరరావు, గారపాటి రామకృష్ణ, రిటైర్డు డీసీ రామాంజినేయులు, పత్తిపాటి రామాంజనేయులు, రవి నాయుడు, వెంకట్, కలవీర ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాల తీరుతో కార్మికులకు అన్యాయం

బాగేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీమంతులకు అండగా ఉంటూ సామాన్యులు, కార్మికులను విస్మరించాయని ఆరోపిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బసవరాజు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో 18వ సమ్మేళనం నేపథ్యంలో పట్టణంలో గురువారం సుందరయ్య భవనం నుంచి గూళూరు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజావ్యతిరేక విధానాలు సరికాదన్నారు. రాష్ట్రంలో మూడేళ్లుగా కొవిడ్ తోపాటు అతివృష్టి, అనావృష్టి తదితర ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కొంతకాలంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటినా నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. కార్మికులు, రైతులకు అండగా సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ పరిశ్రమల పేరిట రైతుల భూములు లాక్కుంటున్నారని, సరైన పరిహారం ఇవ్వడం లేదన్నారు. ర్యాలీలో కేఎస్ ఉమేశ్, బయ్యారెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, ముని వెంకటప్ప, ఓబళరాజు, జయరామరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం ర్యాలీలో కళాకారుల బృందం

## స్వచ్ఛతకు ప్రాధాన్యమిద్దాం..

బంగారపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛతకు ప్రాధాన్యతనిచ్చేలా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ఈనెల 19 నుంచి డిసెంబరు 10వరకు ప్రత్యేక అభియాన నిర్వహిస్తున్నారు. 'మన శౌచాలయం - మన గౌరవం' అనే నినాదంతో పాఠశాల, కళాశాలల్లో జాగృతి శిబిరాలు నిర్వహిస్తున్నారు. గురువారం తాలూకాలోని కెసరనహళ్లి పంచాయతీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటైన జాగృతిలో పీడీఓ శంకర్ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా మన దైనందిన జీవితంలో మెరుగైన విధానాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని, చుట్టుపక్కల ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించాలన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి, గోవింద, బెంగనూరు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పీడీఓ శంకర్ తదితరులు

### వక్ఫ్‌బోర్డు తీరుకు

## వ్యతిరేకంగా బీజేపీ నిరసన

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సామాన్యుల పట్ల దారుణంగా వ్యవహరిస్తోందని పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డు తీరును నిరసిస్తూ వివిధ ప్రాంతాలలో బీజేపీ ఆందోళన చేసింది. కలబురగిలో గురువారం నిరసన ర్యాలీలో ఛలవాది నారాయణస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి జమీర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నామన్నారు. వక్ఫ్‌బోర్డును ప్రభుత్వ రికార్డులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. వక్ఫ్‌బోర్డు నోటీసులను ఖండిస్తూ నేగిలయోగి స్వాభిమాన వేదిక ఆధ్వర్యంలో నిరసనకు స్వామిజీలు పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిరసన కొనసాగించదలిచామని అయితే తొలిరోజున ముఖ్యనేతలు బీపీఎల్ కార్డుల రద్దుపై పలు చోట్ల ఆందోళనలో పాల్గొన్నారని ఛలవాది తెలిపారు.

### 14 నెలల పసిపాపకు

## విజయవంతంగా గుండెమార్పిడి



మీడియాతో ఆసుపత్రి వైద్య బృందం

బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అత్యంత చిన్న వయస్సులోనే గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న 14 నెలల పసిపాపకు గుండెమార్పిడి శస్త్రచికిత్సలను నారాయణ ఆసుపత్రి వైద్యులు విజయవంతం చేశారు. అత్యంత తక్కువ వయస్సు కల్గిన పాపకు ఆపరేషన్ ద్వారా ప్రాణం పోశారు. ఈమేరకు గురువారం నారాయణ వైద్యనిపుణులు శశిరాజ్ బృందం ఆపరేషన్ వివరాలను మీడియాకు తెలిపారు. రెండున్నరేళ్ల చిన్నారి కోలుకోలేని నాడీసంబంధ స్థితికి చేరడంతో దాతగా మారారు. చిన్నారి కుటుంబ సభ్యులు మానవత్వంతో ముందడుగు వేశారు. ఇటీవల ఆగస్టు 18న డాక్టర్ సుదేశ్ ప్రభు నేతృత్వంలో పసిపాపకు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్నట్టు శశిరాజ్ వెల్లడించారు. పది నెలల వయసున్నప్పుడే గుండె సంబంధిత సమస్యలు వెలుగులోకి వచ్చిందని నారాయణ హెల్త్ వ్యవస్థాపకుడు డాక్టర్ దేవిశెట్టి తెలిపారు. నాలుగు నెలలపాటు చికిత్సలు కొనసాగాయని, అయితే గుండెమార్పిడి అవసరమని గుర్తించామన్నారు., అందుకు తగిన దాత అందుబాటులోకి రావడంతో ఆపరేషన్ సాధ్యమైందన్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

## జాతీయస్థాయికి హ్యాండ్‌బాల్ క్రీడాకారులు



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

బాగేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులను బీఈఓ కార్యాలయంలో గురువారం బీఈఓ వెంకటేశప్ప ఆత్మీయంగా సత్కరించారు. 2024-25 రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో మండ్య జిల్లా నాగమంగల తాలూకా ఆదిచుంచనగిరి ఆశ్రమ ఆవరణలో బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు బెంగళూరు స్థాయి విభాగంలో జరిగాయి. తాలూకాలోని సత్యసాయి విద్యానికేతన్ విద్యార్థులు ప్రజ్వల్, ఎన్‌ఆర్ దిలీప్, భువనజ్‌లు ఈనెల 25 నుంచి 29వరకు ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాథ్ తెలిపారు. తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ సాధించిన విద్యార్థులను అభినందించారు. తాలూకా విద్యా సమన్వయ అధికారి వెంకటరామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నంజుండప్ప, ఈసీఈ రవికుమార్, ఆనందబాబు, పీఎన్ నారాయణస్వామి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం - పెడ్లర్ అరెస్టు

బంగారపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో తాలూకా వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియా పెచ్చు పెరిగిన తరుణంలో యువత, విద్యార్థులకు మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారని ఎస్పై దయానంద్ అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ రహితకోసం పాటుపడుతున్నామని శపథం చేసిన తరుణంలో ఒక పెడ్లర్‌ను అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన మనోజ్ (24)ను అరెస్టు చేశారు. డార్జిలింగ్ నుంచి గంజాయిని తెప్పిస్తున్నట్టు గుర్తించామన్నారు. సుమారు 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిక్కఅంకండహళ్ళి వద్ద కోడిపందేలపై నిఘా వేసి ఏడుగురిని అరెస్టు చేశారు. పేకాట అడ్డాలపై దాడులు నిర్వహించారు. మద్యం మత్తులో యువకులపై దాడికి పాల్పడుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇలా నేరాల నియంత్రణలో కఠిన చర్యలు తీసుకోవడంపై ఎస్సైకు ప్రజలనుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

# సూపర్ సేవలు

● పేదలపాలిట వరం.. శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
● ఉచితంగా.. అత్యంత అధునాతన వైద్యం ● మత, కుల, ప్రాంతం, దేశాలకు అతీతంగా సేవలు ● నేటితో 33 వసంతాలు పూర్తి

పుట్టపర్తి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేద, ధనిక, కుల, మత, ప్రాంతం, దేశం అనే వివక్ష లేకుండా అందరికీ ఉచితంగా.. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని శ్రీసత్యసాయి బాబా సంకల్పంతో ఏర్పాటైందే పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి. తన మాతృమూర్తి ఈశ్వరాంబ కోరిక మేరకు 1956లో పుట్టపర్తిలో సత్యసాయి జనరల్ హాస్పిటల్ స్థాపించారు. దీనిలో సేవలు ప్రారంభించి శుక్రవారంతో 33 వసంతాలు పూర్తి అవుతోంది. రోజురోజుకూ ఇందులో వైద్య సేవలను విస్తరిస్తున్నారు. స్థానికులకే కాదు.. ఆర్థిక స్థోమత లేని అనేక రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రజలు ఈ ఆస్పత్రి ద్వారా ఆధునిక వైద్య సేవలను.. పూర్తిగా ఉచితంగా పొందుతున్నారు.

● దక్షణాసియాలోనే అతిపెద్దది..

దక్షణాసియాలోనే అతిపెద్ద సూపర్ హాస్పిటల్ ఇది. ఇక్కడ గుండె, కన్ను, యురాలజీ, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర జబ్బులకు ఉచితంగా వైద్యసేవలందిస్తారు. నాటి భారత ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 1991 నవంబరు 22న శ్రీసత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరిట ఆసుపత్రిని సత్యసాయి బాబా ప్రారంభించారు. నాటి నుంచి ఆస్పత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యసేవలు ఉచితంగా నిరుపేదలకు అందిస్తున్నారు.

● దేవాలయాన్ని తలపించేలా

110 ఎకరాల్లో రూ 300 కోట్లతో ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేసి.. ప్రారంభించారు. నాటి నుంచి అందులో శస్త్రచికిత్సలు మొదలుపెట్టారు. ఈ ఆస్పత్రి లో వాతావరణం ప్రశాంతంగా.. ఆహ్లాదక రంగా ఉంటూ ఒక దేవాలయంలో ఉన్నట్లు అగుపిస్తుంది. ఇక్కడ వైద్యసేవ లకు వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని భాషలకు సంబంధించిన తర్జుమా చేసేవారు అందుబాటులో ఉండటం విశేషం.



శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1631.08 | 1,601.89 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 3,269 | 1,829 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 8,007 | 8,450 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 98.18 | 24.06 |

## బాలకార్మికులకు విముక్తి



సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు దుకాణాలపై బాలకార్మిక నిర్మూలన అధికారులు దాడులు చేసట్టారు. గురువారం సుధా క్రాస్, గ్యారేజ్, మెకానిక్ షాపు,ఐస్ క్రీమ్‌పార్లర్, మటన్ షాపు తదితర వాటిపై ఆకస్మిక దాడులు నిర్వహించి బుధవారం కార్మిక శాఖ తరపున ఆకస్మిక దాడి చేసి నలుగురు బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు కార్మికుల పథకం ప్రాజెక్టు అధికారి మౌనేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాన్ ఇండియారెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బళ్లారి తాలూకా గ్రేడ్-2 తహసీల్దార్ మంజునాథ్, తాలూకా టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారుల బృందంతో సమావేశం నిర్వహించి దాడులు నిర్వహించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. లేబర్ ఇన్‌స్పెక్టర్లు పరశురాం, రమేశ్, ఇన్‌స్పెక్టర్ వరుణ్, ఫీల్డ్ రిసోర్స్ ఆఫీసర్ బాషా, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ చైల్డ్ లైన్ సిబ్బంది చంద్రకళ, నిలోఫియా, స్వయం సేవా సిబ్బంది పాల్గొన్నారు.

## 24న కార్తీక వన భోజనం

సిరుగుప్ప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీన కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమ్మసంఘం తాలూకా అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో ఏటా వన భోజనాలు నిర్వహిసున్నామని, ఈ ఏడు కూడా కుల బాంధవులు, కమ్మ సంఘం నాయకులు, ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తులసీ దామోదర పూజలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంఘం కార్యదర్శి సత్యనారాయణ, ప్రముఖులు రవికిరణ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

బళ్లారి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుధవారం తాలుకాలోని పీడీహళ్లి ఎన్‌హెచ్ 63 రోడ్డు వద్ద రోడ్డు పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందు వెళుతున్న లారీని గమనించగా వెనక నుంచి మరో లారీ బలంగా ఢీ కొంది. డ్రైవర్‌కు గాయాలు కావడంతో బళ్లారి హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



దెబ్బ తిన్న లారీ

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి: మేయర్

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థులు, నగర ప్రజలు, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ ముల్లంగి నందీశ్ సూచించారు. రాష్ట్రీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నగర కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పురస్కార ప్రధానోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్ రంగనాథన్, సరస్వతి చిత్రపటాలకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ సెంటర్ లైబ్రరీకి అవసరమైన సౌకర్యాలను కార్పోరేషన్ ద్వారా కల్పిస్తామని హామీ ఇచ్చారు. నగర గ్రంథాలయ సంస్థ సంచాలకులు లక్ష్మీ కిరణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాల యాలతో తమ గొప్ప భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. చీఫ్ లైబ్రేరియన్ నరసన్న పఠన ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం గ్రంధాలయాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రరీ ఉత్తమ రీడర్ అవార్డు, ఇద్దరు ఉత్తమ పాఠకులకు మెరిటోరియస్ రీడర్ అవార్డులు లభించాయి. బళ్లారి కేఈబీకి చెందిన ఇంజనీర్ ఆంజనేయులు, గాంధీనగర్‌కు చెందిన విజయలక్ష్మి ,ఉత్తమ రీడర్ అవార్డును గెలుచుకున్నారు. ఈసందర్భంగా శ్రీ మేధ ప్రీ గ్రాడ్యుయేట్ కళాశాల కన్నడ లెక్చరర్ సుమ, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌సాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు సిద్దప్ప, సంతోష్‌కుమార్, అసోసియేట్ లైబ్రేరియన్ ప్రభాకర్, శారద, మహేంద్ర, డ్రైవర్ శ్రీనివాస్, టైపిస్ట్ సంతోష్, కేంద్ర గ్రంథాలయంలోని వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాపాఠకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీష్

## ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలి: ఏఐడీఎస్‌ఓ




మాట్లాడుతున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి):పాఠశాలలు, కళాశాలల్లో అన్ని స్థాయిల ఫీజుల పెంపును నిలిపివేయాలని ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కంబళి మంజునాథ్ అన్నారు. గురువారం నగరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలని, మూతపడిన పాఠశాలలను తెరిపించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, బోధనేతర పోస్టులను శాశ్వత ప్రాతిపదికన వెంటనే భర్తీ చేయాలన్నారు. పలు డిమాండ్లతో ఏఐడీఎస్‌ఓ 10వ అఖిల భారత సదస్సును న్యూఢిల్లీలో నవంబరు 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్, నేతాజీ వంటి గొప్ప విప్లవకారులు రాజకీయంగా, ఆర్థికంగా,సాంస్కృతికంగా , సామాజికంగా మౌలిక మార్పు తీసుకురావాలన్నారు. స్వాతంత్యం వచ్చిన నాటి నుంచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ విద్యకు నిధుల్లో కొత విధిస్తున్నా యన్నారు. ఎన్ఈపీ విద్యా విధానం అమలులో భాగంగా 13,800 ప్రభుత్వపాఠశాలలను విలీనం పేరుతో మూసివేయడం తగదన్నారు. సదస్సులో విద్యాభిమానులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్దపెత్తున పాల్గనాలని పిలుపునిచ్చారు. ఏఐడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఎం.శాంతి, ఉమాదేవి, ప్రమోద్, జిల్లా కోశాధికారి అనుపమ పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షురాలికి సన్మానం

బళ్లారి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని చేళగుర్కి గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షురాలిగా లక్ష్మీ నాగరాజు, ఉపాధ్యక్షురాలిగా లోకేశ్వరి, యల్లప్పలను తాలుకా పంచాయతీ ఈఓ మడిగిన బసప్ప ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజేతలకి గ్రామ పంచాయతీ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ చంద్ర, ఓబుళేసు, రత్నమ్మ, మంగమ్మ మాజీ జిల్లా పంచాయతీ సభ్యులు మల్లయ్య, మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు హనుమంతు, సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న పంచాయతీ సభ్యులు

## రేపటి నుంచి వరి కొనుగోళ్లు ప్రారంభం

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏపీఎంసీలో వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం నుంచి ప్రారంభిం చనున్నట్లు ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. గతంలో జిల్లా అధికారులు డిసెంబరు వరకు రైతులు వరి ధాన్యం అమ్మేవారు తమ పేర్లు డిసెంబర్ వరకు నమోదు చేసుకుని ఫిబ్రవరి, జనవరిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని ఆదేశించారు. కానీ కంప్లి కురుగోడు తాలుకాలోని గ్రామాల్లో వరి రైతులు తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆందోళన చేపడ్తున్నారు. నిరసనలపై స్పందించిన ఎమ్మెల్యే జేఎన్ గణేష్ సీఎంకు విషయాన్ని తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించి రైతులు నష్టపోకుండా జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలను 23 నుంచి ప్రారంభించాలని ఆదేశాలు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్ని కంప్లి ఏపీఎంసీ కొనుగోలు కేంద్రంలో విక్రయించవచ్చుని ఎమ్మెల్యే తెలిపారు. నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.



సీఎంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

## మొక్కజొన్న దగ్ధం

కంప్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంటలతో మొక్కజొన్న పంట దగ్ధమయ్యింది. అడగళి తాలుకా పరిధిలోని నీరకోరనహళ్లి గ్రామంలో ఖాళీ స్థలంలో వేసుకున్న మొక్కజొన్న రాశులు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయని రైతులు వాపోతున్నారు. సుమారు రూ. 6 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేసున్నాడు. రైతు శివకుమార్ తొమ్మిది ఎకరాలు, హాలేష్, నాగరాజులకు చెందిన రెండు ఎకరాల చొప్పున పంటను రాశులు పోసుకున్నారు. కలంలో నునుపు చేసి అమ్మేందుకు సిద్ధం చేసిన సమయంలో ఇలా గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టడంతో పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



కాలిన పంటను పరిశీలిస్తున్న రైతులు

## వాహనాలను పరిశీలించిన ఎస్పీ

రాయచూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు అందజేసిన వాహనాలు, ఇతర పరికరాలను గురువారం జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య పరిశీలించారు. నగరంలోని ఎస్పీ కార్యాలయం పోలీస్ పరేడ్ మైదానంలో వాహనాలను పరిశీలించిన ఎస్పీ, వాటి వినియోగం వివరాలు తదితర వాటి గురించి సిబ్బందికి అధికారులకు వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా కార్యచరణను మరింత సమర్థవంతంగా సాగించాలని సూచించారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ పుట్ట మాదయ్య



నిరసనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

## ‘వక్ఫ్’పై బీజేపీ నిరసన

బళ్లారి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ‘మా భూమి మా హక్కు’ అంటూ రైతుల, మఠాలు, దేవాయాల ఆస్తులను అక్రమంగా వక్ఫ్ కు బదలాయించడంపై బీజేపీ నాయకులు గురువారం డీసీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కబరస్థాన్ మసీదులకు చెందిన 65ఆస్తులను ప్రభుత్వం వక్ఫ్ గా నోటీసులు జారీ చేసింది. సిరుగుప్ప తాలూకా ఇబ్రహీంపుర గ్రామం, బళ్లారి తాలూకా బొమ్మనహాల్‌కు చెందిన రైతుల భూములు కూడా వక్ఫ్‌లో చేరాయి. వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు కానీ వ్యక్తిగత వారసత్వం నుంచి వచ్చిన ఆస్తులను వక్ఫ్‌గా చూపడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు మాట్లాడుతూ ప్రజా ఆస్తులపై జిహాద్ లేదన్నారు. గంగావతి ఎమ్మెల్యే జనార్ధనరెడ్డి, మాజీ మంత్రి బి.శ్రీరాములు, నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, సోమలింగప్ప, పార్టీ నాయకులు మహిపాల్, గురులింగనగౌడ, గణపాల ఐనాథరెడ్డి , సిద్దారెడ్డి, పంపాపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గణితంపై ఆసక్తి పెంచేందుకే సెమినార్లు



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడంతో సెమినార్లు కీలక పాత్ర పోషిస్తాయని, వీటిలో చురుగ్గా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాపంచాయతీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీష్ శివాచార్యులు సూచించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ, పాఠశాల విద్యాశాఖ , అక్షర పౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాపంచాయితీ హాల్లో గణిత అభ్యాస ఉద్యమం-జిల్లాస్థాయి సదుస్సు ఆయన ప్రారంభించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల దశ నుంచే గణిత అభ్యాసం పైమక్కువ కలగడానికి వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అక్షర పౌండేషన్ డెవలప్‌మెంట్ శంకర్ నారాయణ మాట్లాడుతూ హైస్కూల్ పిల్లల్లో పాఠ్యాంశాలను అమలు చేసేందుకు పాఠశాల స్థాయిలోనే పిల్లలకు గణితంలో నాణ్యమైన శిక్షణ అందించేందుకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, పాఠశాల విద్యాశాఖ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాశ్, కర్ణాటక రాష్ట్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం జిల్లాధ్యక్షుడు నింగప్ప, గ్రామపంచాయితీ అధ్యక్షుడు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.అనంతరం బళ్లారి జిల్లాలో గ్రామపంచాయితీ స్థాయి గణిత పోటీల నివేదికను జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప విడుదల చేశారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని 25పాఠశాలలు, 25గ్రామపంచాయితీలు మంచి ఫలితాలు సాధించినందుకుగానూ వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాల అధ్యక్షులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

బళ్లారి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సండూరు ఓట్ల లెక్కింపు కేంద్రాలను అధికారులు పరిశీలించారు.ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈనెల 23న బళ్లారి పాలిటెక్నికల్ కళాశాలలో చేపట్టనున్నారు. గురువారం కేంద్ర ఎన్నికల కమిషనర్ హెచ్.డీ. రాజేష్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సండూరులో 76.02 శాతం పోలింగ్ జరిగిందన్నారు. లెక్కింపునకు మొత్తం 15 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఓటింగ్‌కు మొత్తం 253 ఈవీఎంలు వినియోగించామన్నారు. కౌంటింగ్ అధికారులు, ఏజెంట్లుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు హాజరయ్యేవారు తప్పని సరిగా నిబంధలు పాటించాలని సూచించారు.

## టపాసుల మందు పేలి చెరకు పంట దగ్ధం

● ముగ్గురికి గాయాలు ● పరామర్శించిన ఎమ్మెల్యే



చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



కాలిపోయిన చెరకు

కంప్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలంలో ఉంచిన టపాసుల మందు పేలి చెరకు పంట కాలిపోయింది. విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకాలోని జమ్మలి గ్రామంలో రైతు వన్నూరప్ప అడవి పందులు, ఎలుగుబంట్లు, వేరుశనగ పంటల దాడి నుంచి కాపాడుకోవడానికి టపాసుల మందును పొలంలో ఉంచారు. రాత్రి వేళల్లో టపాసులు పేల్చి జంతువులను బెదరగొడుతుంటారు. కానీ పొలంలో ఉన్న మందుగుండు సామగ్రి పేలడంతో పంట కాలిపోయింది. పొలంలో ఉన్న వన్నమ్మ, గౌతమి, ముఖ్యశీలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కూడ్లిగి ఆస్పత్రికి తరలించారు. రైతు నిర్లక్ష్యంతోనే ఇటు పంట నష్టంతో పాటు మహిళలకు కూడా గాయాలయ్యాయని స్థానికులు వాపోయారు. కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని గాయపడిన మహిళలను, చిన్నారులను పరామర్శించారు. పొలాల్లో పేలుడు పదార్థాలు ఉంచకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## దివ్యాంగులను ప్రోత్సహించాలి: ఏడీసీ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏడీసీ శివానంద

రాయచూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను నిరాశపరచకుండా ప్రోత్సహించాలని, శారీరక వైకల్యాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదురించాలని ఏడీసీ శివానంద సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో దివ్యాంగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఏడీసీ, దివ్యాంగుల్లో అపారమైన శక్తి, సామర్థ్యాలు దాగి ఉంటాయని తమకున్న సమర్థతను గుర్తించుకుని వాటి ఆధారంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

రాయచూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వసతి పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు తగిన నిబంధనలు అనుసరించాలని జిల్లా వసతి నిలయాల ప్రత్యేక ఇంచార్జ్ అధికారి డాక్టర్ దుర్గేష్ సూచించారు. గురువారం నగరంలోని పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతి నిలయాన్ని పరిశీలించిన అధికారి అక్కడి విద్యార్థులకు అందజేసే ఆహార పదార్థాలన్నింటిని తనిఖీ చేశారు. అప్పటికే వండి సిద్ధం చేసిన పదార్థాలను రుచి చూసిన అధికారి తాజా కూరగాయలు వాడాలన్నారు.

# హోసూరు జోన్

## సమస్యలను పరిష్కరిస్తాం: ఎంపీ



ప్రసంగిస్తున్న ఎంపీ గోపీనాథ్

హోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ గోపీనాథ్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సత్య అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. సమావేశానికి హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ పాల్గొన్నారు. కార్పొరేషన్ సభ్యులు తమ వార్డుల పరిధిలోని సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ మేయర్ సత్యకు రెండుసార్లు మునిసిపాలిటీలో వ్యవహరించారని, ఆయనకు తోడుగా సమర్థుడైన శ్రీకాంత్‌లు కార్పొరేషన్ ప్రగతికి కృషి చేస్తున్నారన్నారు. అన్నాడీఎంకే పాలనలో చెత్త సేకరణ పన్నును విధించారని, ప్రస్తుతం డీఎంకే అధికారం ఉందని రద్దు చేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు ఉచితంగా పట్టాలు అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ బెంగళూరు నుంచి హోసూరు వరకు మెట్రో ప్రాజెక్టు ఏర్పాటుకు, విమానాశ్రయం కోసం తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే 4 స్థలాలను పరిశీలించిందని అందులో 2వేల ఎకరాలు విస్తీర్ణంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తామన్నారు. రామనాయక్ చెరువుకు అనుబంధంగా పార్కుకు రాజీవ్‌గాంధీ పేరు పెట్టాలని ఎంపీ కోరారు. హొగనేకల్ నుంచి కావేరి నీటిని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న రోడ్లపై ఫ్లై ఓవర్‌లు నిర్మించేందుకు కార్పొరేషన్ తరఫున సమష్టిగా చర్యలు తీసుకుంటామన్నారు. సంవత్సరంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

హోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కెలమంగలం వద్ద కారును టిప్పర్ లారీ ఢీ కొనడంతో కారులో ఉన్న ఓ మహిళ, చిన్నారి మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పుదుచ్చేరి జిల్లా ఆలంగుడికి చెందిన ఐదుగురు బంధువులతో కలసి హైదరాబాద్ నుంచి వాపసు వస్తున్నారు. హోసూరు మీదుగా డెంకణీకోట మార్గంలో వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఎంశాండ్ లోడుతో వస్తున్న టిప్పర్‌లారీ, కారును ఢీ కొంది. కవిత (43), సోంబుగన్ ఏడాదిన్నర బాలుడు తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కారులో ఉన్న అభిరామి, నటరాజ్, ప్రభాకర్ ముగ్గురు తీవ్ర గాయాలతో హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




నిరసనలో న్యాయవాదులు

## దాడిని ఖండిస్తూ న్యాయవాదుల నిరసన


హోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోసూరులో కోర్టు వ్యవహారాలను న్యాయవాదులు బహిష్కరించారు. బుధవారంకోర్టు ఆవరణలో ఒక న్యాయవాదిపై దాడి జరగడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు కలాపాలను బాయ్‌కాట్ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని తమిళనాడు ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సాయుధ పోలీసులతో రక్షణ కల్పించాలన్నారు. కాగా ప్రాణాలతో పోరాడుతున్న న్యాయవాది చికిత్సకోసం ప్రభుత్వం రూ.25లక్షల ఆర్థికసాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంతవరకు ఈ సంఘటనపై న్యాయశాఖ మంత్రి ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోవడం విచారకరమన్నారు.

### మహిళ ఆత్మహత్య

హోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఆరు నెలలకే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కెలమంగలం సమీపంలోని బిన్నూరుకు చెందిన సంధ్య (19)కు శివాజీతో ఆరు నెలలక్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో సంధ్య పుట్టింటికి వచ్చింది. ఆమెను తల్లి సరస్వతి ప్రతి అంశాన్ని మందలించేది. మనస్తాపానికి చెందిన సంధ్య ఈనెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కెలమంగలం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు డీఎస్పీ ఆనందరావు తెలిపారు.

## కిడ్నీ సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు

హోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని డాక్టర్ షణ్ముగం అభిప్రాయపడ్డారు. హోసూరు - రాయకోట రోడ్డులోని మీరా మల్టి స్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిలో కిడ్నీ రోగులకోసం ప్రత్యేక విభాగం ప్రారంభించారు. గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆధునిక పద్ధతిలో డయాలసిస్ సేవలు లభిస్తాయని డాక్టర్ తెలిపారు. నెలాఖరు వరకు రాయితీతో వైద్య సేవలు ఉంటాయన్నారు. నిపుణులైన డాక్టర్లు ఉన్నారని మూత్రపిండాల సమస్యలకు సంబంధించిన అన్ని శస్త్రచికిత్సలు లభిస్తాయన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ షణ్ముగం